- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
18-09-2026

సంపుటి : 01 సంచిక :177 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 177 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



అభిషేక్ అదరహో

- 30 బంతుల్లోనే శతకబాదిన శర్మ
- 127 పరుగులతో భారత్ ఘన విజయం
- 3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్
- భారత్ 221/7, అఫ్గనిస్తాన్ 94/10

03

30 బంతుల్లోనే శతకం బాదిన అభిషేక్ శర్మ అఫ్గాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 34 బంతుల్లో 108 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ 221/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు చెలరేగడంతో అఫ్గనిస్తాన్ 94 పరుగులకే ఆలౌటైంది. 127 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.



03

జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

- జిన్‌పింగ్ ఆరోగ్యంపై వాంజున్ షీ సంచలన పోస్టు
- బ్రిక్స్ సదస్సులో స్వల్ప బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందన్న ప్రచారం
- స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను చైనాకు తరలించారన్న వాదన
- ఆర్మీ ఆసుపత్రిలో రహస్యంగా చికిత్స అందిస్తున్నారన్న ఆరోపణ
- మోదీ ప్రసంగం వేళ జిన్‌పింగ్ తూలినట్టు కనిపించడంతో చర్చ
- జిన్‌పింగ్ ఆరోగ్యంపై మోదీ ఆరా తీసినట్టు సమాచారం
- మోదీ ఇచ్చిన విందుకు హాజరుకాకుండానే చైనాకు పయనం
- జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై అధికారిక స్పష్టత కరవు

తెలంగాణ నేలది ధిక్కార స్వరం

అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం



03

- భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే కమ్యూనిస్టుల సాయుధ పోరాటం
- సెప్టెంబర్ 17 ప్రజాస్వామిక పాలనకు మార్గం వేసిన రోజు
- రైతులకు భరోసా ఉండాలి...మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- ప్రతి పేదబిడ్డకూ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం
- ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరాలనే లక్ష్యంతో పాలన
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

అణచివేత, దోపిడీ, పెత్తందారీ విధానాలను ఎదిరించిన చరిత్ర తెలంగాణ గడ్డదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సమ్మక్క--సారలమ్మ పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ధిక్కరించడమే తెలంగాణ ప్రజల స్వభావమని పేర్కొన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలిస్తూనే ఉందన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగించాలన్న తెలంగాణ చరిత్ర స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం ప్రసంగించారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడటం, ప్రభుత్వ వనరులు అందరికీ అందేలా చూడటం, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు కల్పించడమే ప్రజా పాలన అని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు.



పోలీస్ పరీక్షకు డేట్ ఫిక్స్

- నవంబర్ 28న ఎస్ఐ రాత పరీక్ష
- డిసెంబర్ 20న పీసి తత్సమాన పోస్టులకు పరీక్ష
- వయస్సు సడలింపుతో 1.13 లక్షల మందికి లబ్ధి
- 1,46,220 మహిళా అభ్యర్థుల దరఖాస్తు
- దరఖాస్తు దారుల్లో 4,30,844 పురుషులు
- మొత్తం 7,437 పోస్టులకు 5,77,064 దరఖాస్తులు

హైదరాబాద్, -17సెప్టెంబర్ (మహాప్రభ). తెలంగాణలో పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి బోర్డు చైర్మన్ వివి శ్రీనివాసరావు గురువారం ప్రిలిమినరీ రాత పరీక్షల తేదీల వివరాలను అధికారికంగా విడుదల చేశారు. నవంబర్ 28న ఎస్ఐ, తత్సమాన పోస్టులకు సంబంధించి ప్రిలిమినరీ రాత పరీక్ష, డిసెంబర్ 20న కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల రాత పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రిపరేషన్ ను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 7,437 ఖాళీల భర్తీ కోసం జులై 29న నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఆన్ లైన్ దరఖాస్తుల ప్రక్రియ విజయవంతంగా

-మిగతా 3 లో



03

నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్!

- ఢిల్లీలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు
- ఐఆర్‌డీపఐ ఆధ్వర్యంలో ఏఎన్‌పీఆర్ వ్యవస్థకు శ్రీకారం
- ఐఐబి, 'వాహన్' రికార్డులతో వాహన నంబర్ల సరిపోలింపు
- థర్డ్ పార్టీ బీమా ఉందో లేదో ఆటోమేటిక్‌గా తనిఖీ
- బీమా లేని వాహనాలకు పెట్రోల్, డీజిల్ విక్రయాల నిరాకరణకు అవకాశం
- సుప్రీంకోర్టు ప్రతిపాదించిన విధానం అమలుకు చర్యలు
- ప్రయోగం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశం
- బీమా లేని వాహనాలను బీమా పరిధిలోకి తెచ్చే లక్ష్యం

బ్రిక్స్ సదస్సుపై పాక్--ఐఎస్ఐ ఉగ్ర కుట్ర

- బ్రిక్స్ సదస్సును భగ్నం చేయాలనుకున్న పాక్, ఐఎస్ఐ..
- ఐఎస్ఐ ఆధ్వర్యంలో చొరబాటు యత్నం
- హీరానగర్ నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు ప్లాన్
- బోబియా ప్రాంతంలో చొరబాటు స్థావరాల ఎంపిక
- సదస్సు వేళ భారీ దాడికి కుట్ర
- ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులే టార్గెట్
- ముందే పసిగట్టిన భద్రతా బలగాలు
- అప్రమత్తతతో తప్పిన పెను ఉగ్ర ముప్పు

03



ఇకపై మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి!

- కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదన
- మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై నిఘా
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారమే మందులు విక్రయించేలా పర్యవేక్షణ
- డ్రగ్స్ రూల్స్--1945లోని రూల్ 65కు సవరణల ప్రతిపాదన
- సీసీటీవీ రికార్డులను కనీసం మూడు నెలలు భద్రపరచాలి
- మందుల సరఫరా, రవాణా కూడా ప్రిస్క్రిప్షన్ ప్రకారమే
- కొత్త నిబంధనలపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరణ





తెలంగాణకు భారీ వర్ష సూచన

- ఐదు రోజుల పాటు దంచికొట్టనున్న వానలు
- హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ
- ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు
- ఈ సీజన్లో రాష్ట్రంలో ఇప్పటికీ 19 శాతం వర్షపాతం లోటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్, -17సెప్టెంబర్ (మహాప్రభ). తెలంగాణలో రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారాయి. రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం (19వ తేదీ) నుంచి వర్షాల తీవ్రత పెరగనుందని తెలిపింది. గురు, శుక్రవారాల్లో కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన

-మిగతా 3 లో

కేసీఆర్, రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధం

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



దమ్ముంటే సీఎం సవాల్ స్వీకరించాలి

- బీఆర్ఎస్ సస్పెన్షన్లు ఎత్తేయాలి
- నెల రోజుల పాటు అసెంబ్లీ నడపాలి
- కాంగ్రెస్ హామీలపై సభలో నిలదీస్తాం
- సీఎం అసెంబ్లీ పవిత్రతను దెబ్బతీస్తున్నారు
- రేవంత్ మాటల్లో వాస్తవం లేదన్న కేటీఆర్
- జాతీయ సమైక్యతా దినోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ -17సెప్టెంబర్ (మహాప్రభ). బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు, సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 -- జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో

-మిగతా 3 లో



03

రష్యా చమురు కొనవద్దని అమెరికా అల్టిమేటం..

- రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా వార్నింగ్
- తీవ్రంగా స్పందించిన భారత్..!
- భారత్, చైనాలకు 100 శాతం సుంకాల ముప్పు
- ఆంక్షల బిల్లుకు అమెరికా సభ గ్రీన్‌సిగ్నల్
- ట్రంప్ సంతకం కోసం బిల్లు సిద్ధం
- ఇంధన భద్రతపై భారత్ స్పష్టత
- మార్కెట్ పరిస్థితుల మేరకే చమురు కొనుగోళ్లు
- అమెరికా చర్యలపై న్యూఢిల్లీ అసంతృప్తి
- వాణిజ్య ప్రయోజనాలు కాపాడుకుంటాం

నార్సింగిలో ఘనంగా తెలంగాణ విమోచన, ప్రధాని నరేంద్ర మోడీ విశ్వకర్మ జయంతి వేడుకలు

-జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్



మెదక్ జిల్లా -17,సెప్టెంబర్ (మహాప్రభ).
పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో గురువారం రోజు గ్రామ ఉప సర్పంచ్ శ్రీరామ్ నరేష్ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం,విశ్వకర్మ జయంతి ప్రధానమంత్రి,ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా జండా ఎగురవేసిన అనంతరం నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు భారతీయ జనతా పార్టీ(బీజేపీ)ఆధ్వర్యంలో 9 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ పిలుపు నిచినట్లు ఆయనవెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బీకొండ రాములు నేత,మాజీ జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, జిల్లా కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు చంద్రన్న,మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సిద్ధిరాములు,జిల్లా నాయకులు ఆకుల సుధాకర్,జిల్లామైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి బుల్లెట్,నార్సింగ్ బూత్ అధ్యక్షులు చాకలి పెంటయ్య,రామాపురం ఈశ్వర్,చాకలి సాయిలు, ఉప్పరి శ్రీకాంత్ సోలంకి, మహేష్,పాపన్నపేట పట్టణ అధ్యక్షుడు సుంకరి కిష్టయ్య,వెంకట్,సాయి బాబా,మల్లేశం,శంకర్ గౌడ్,సున్నం లక్ష్మణ్,బైండ్ల దుర్గయ్య,బైండ్ల రాజు,వడ్ల చంద్రశేఖర్,తాడేపు శేఖర్ లక్ష్మీ నగర్ రమేష్, ఏడుకొండలు,యేసు, కుమార్,విట్టల్,సంతోష్ రెడ్డి, రాజుతో పాటు దాదాపు 50 మంది బిజెపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుకలు.. తెలంగాణ విమోచన దినోత్సవం

-దేవరకద్రలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు



దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 17 మహాప్రభ
దేవరకద్ర మున్సిపాలిటీలోని . ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా దేశ ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఆశీర్వాద దీపం వెలిగించి వేడుకలు నిర్వహించాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అప్పటి హైదరాబాద్ సంస్థానంలో కొనసాగిన నిజాం పాలనకు వ్యతిరేకంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ చర్యలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు.
అనంతరం దేవరకద్ర ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ దేవరకద్ర మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యజ్ఞభూపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, దేవరకద్ర నాలుగో వార్డు కౌన్సిలర్ ఉమారాజు, బీజేపీ నాయకులు శేఖర్, రాచాల రాజు, విద్యాసాగర్, శ్రీశైలం చారి, శ్రీను, కొండా వెంకటేశ్వర్‌రెడ్డి, కొండ నాగిరెడ్డి, టైల్స్ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్, తిమ్మన్న, హోటల్ ఆంజనేయులు, అంజి, నరేష్, గణేష్, వెంకటేష్, నరేందర్, వాకిటి ఆంజనేయులు, రాజుమూరి, నట్టలి కృష్ణయ్య, అప్పి, అనిల్‌కుమార్, నవీన్, అమరేందర్‌రెడ్డి, శివకుమార్‌తో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్దెగూడలో ఘనంగా గణపతి దీపారాధన

మంగళహారతులతో పూజలు నిర్వహించిన మహిళలు





దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 17 మహాప్రభ
దేవరకద్ర మండలం, గద్దెగూడ: గ్రామంలోని 3వ వార్డులో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఘనంగా గణపతి దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. కార్యక్రమంలో 3వ వార్డు సభ్యురాలు ఉప్పుగంటి నాగమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అధ్యక్షుడు దేవేందర్తో పాటు శివ, రాజు, సతీష్, చందు, శివాజీ తదితరులు పాల్గొన్నారు. యూత్ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికే మా తొలి ప్రాధాన్యత

-అభివృద్ధిలో ముందంజలో మెదక్
-మెదక్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
-ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి

మెదక్ జిల్లా -17సెప్టెంబర్ (మహాప్రభ).
ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శక్తి , గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాపాలన వ్యవస్థ ఆవిర్భావానికి కృషి చేసిన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులు, అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులందరికీ మంత్రి జోహార్లు అర్పించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజ అని అన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై ప్రజాపాలనకు నాంది పలికి 78 సంవత్సరాలు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.
స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం ఈ గడ్డపై అనేక మంది త్యాగాలు చేశారని మంత్రి గుర్తుచేశారు. 1947 ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య వేడుకల్లో మునిగితేలుతున్న సమయంలో హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛ కోసం పోరాటం కొనసాగించారని తెలిపారు. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుందని నిజాం ప్రకటించి రాచరిక పాలనను కొనసాగించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు.
రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాటం మరింత తీవ్రతరమైందన్నారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి మహిళా యోధులు పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బండి యాదగిరి రచించిన 'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి' వంటి గేయాలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని చెప్పారు.నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని మంత్రి తెలిపారు. ప్రజల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందన్నారు.
48 గంటల్లోనే సంక్షేమానికి శ్రీకారం
ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే అభయహస్తం హామీల అమలుకు శ్రీకారం చుట్టిందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, యువతతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
మహిళలకు ఉచిత ప్రయాణం.. గృహజ్యోతితో జీరో బిల్లులు
మెదక్ జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా



మహిళలకు ఇప్పటి వరకు 4.73 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించామని మంత్రి తెలిపారు. దీని ద్వారా రూ.171.04 కోట్ల ప్రయోజనం మహిళలకు అందిందన్నారు.
గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 1,29,756 విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లులు జారీ చేసి, రూ.113.80 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందించినట్లు వెల్లడించారు.
రైతులకు అండగా ప్రభుత్వం
రైతు భరోసా కింద వానాకాలం 2026లో మెదక్ జిల్లాలో 2,66,674 మంది రైతుల ఖాతాల్లో రూ.222.69 కోట్ల పెట్టుబడి సాయం జమ చేసినట్లు మంత్రి తెలిపారు.
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా కంది, పెసలు, మినుములు, సోయాబీన్, మొక్కజొన్న, ఆముదం, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటలను 28,933 ఎకరాల్లో సాగు చేసినట్లు చెప్పారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.
రూ.1,116 కోట్లతో ధాన్యం కొనుగోళ్లు
యాసంగి 2025--26 సీజన్‌లో రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. 1,00,344 మంది రైతుల నుంచి 4,25,305 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇప్పటి వరకు రూ.1,116.06 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.
పేదలకు మెరుగైన వైద్యం
రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా మెదక్ జిల్లాలో 40,351 మంది పేదలు వైద్య సేవలు పొందారని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.114.07 కోట్లు ఖర్చు చేసిందన్నారు.
మెదక్‌లో కొత్త మెడికల్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని, మెడికల్ కళాశాల భవనానికి రూ.180 కోట్లు, నర్సింగ్ కళాశాల భవనానికి రూ.26 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.
విద్యకు పెద్దపీట
మెదక్ జిల్లాలో విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు రెండు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను మంజూరు చేసి, వాటి నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.
రామాయంపేటలో 20 ఎకరాల్లో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్నామని మంత్రి చెప్పారు.
ఇందిరమ్మ ఇళ్లకు రూ.484 కోట్లు
ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి, రెండో విడతల్లో మెదక్ జిల్లాకు 9,682 ఇళ్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.484.10 కోట్ల బడ్జెట్ కేటాయించగా, నిర్మాణ పురోగతి ఆధారంగా 6,483 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ.177.08 కోట్లు జమ చేసినట్లు వివరించారు.
రూ.500కే గ్యాస్.. ఉచిత సన్నబియ్యం
మెదక్ జిల్లాలో 1,27,040 మంది వినియోగదారులకు ఒక్కొదానికి 500 రూపాయల చొప్పున 8,64,388 ఎల్పీజీ సిలిండర్లు అందించామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.26.14 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించిందన్నారు.
ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు 2,42,353 కుటుంబాలకు 15,033 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 28,582 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, 1,06,448 మంది కొత్త సభ్యులను కార్డుల్లో చేర్చినట్లు తెలిపారు.
మహిళా సంఘాలకు ప్రోత్సాహం
మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.
2026--27 ఆర్థిక సంవత్సరానికి 150 యూనిట్లకు రూ.4.50 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటి వరకు 55 యూనిట్లకు రూ.1.31 కోట్ల రుణాలను అందించినట్లు తెలిపారు.
గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉపాధి హామీ పథకం కింద మెదక్ జిల్లాలో 1,086 పనులకు రూ.98.51 కోట్లు మంజూరు కాగా, 271 పనులు పూర్తయ్యాయని, మరో 438 పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
ఎస్‌డీఎఫ్ కింద 219 అభివృద్ధి పనులు మంజూరు కాగా, 42 పనులు పూర్తయ్యాయని చెప్పారు. రహదారులు, సాగునీరు, తాగునీరు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, రెవెన్యూ తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.
మెదక్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, మహిళా--శిశు సంక్షేమం, మౌలిక వసతులు సహా అన్ని రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని చెప్పారు.
ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. మెదక్ జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభోత్సవనికి పాల్గొన్న ఎమ్మెల్యే,మాజీ మంత్రి

సెప్టెంబర్ 17 మహాప్రభ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా:



శ్రీ లక్ష్మీ మల్టీ స్పెసిలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పెబ్బేరు పట్టణ కేంద్రంలో శ్రీ లక్ష్మీ మల్టీ స్పెసిలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారి యజమాన్యం ఆహ్వానం మేరకు పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని హాస్పిటల్ యాజమాన్యం స్వాగతం పలికి శాలువాతో సన్మానించడం జరిగింది. మాజీ మంత్రి చిన్నారెడ్డి ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి హాస్పిటల్ అంతటిని పరిశీలించి ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి కూడా హాస్పిటల్ డాక్టర్ ని సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.ఇట్టి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.మన్యం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ కురుమూర్తి,జానంపేట మహేశ్వర్ రెడ్డి,అయ్యవారిపల్లి ఆనంద్ సాగర్, పాతపల్లి చంద్రశేఖర్, తిప్పాయిపల్లి ఎల్ల స్వామి నాయుడు, గట్టు రాజు, నందిమల్ల రాము ,బొట్టు శ్రీను, రాజు నాయక్ తిరుపతయ్య శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



మంథని, సెప్టెంబర్ 17 మహాప్రభ
మంథని పట్టణంలోని వినాయక మండపాలను గురువారం తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు తీసుకున్నారు. ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రమంతా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సుభిక్షంగా ఉండాలని గణనాథులను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలు శివ, సెగ్గం రాజేష్, ఆకుల కిరణ్, ఆకుల శ్రీనివాస్, గూండా రాజు కార్యకర్తలు అన్ని వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు..

పోలీస్ పరీక్షకు డేట్ ఫిక్స్

మొదటి తరువాయి

ముగిసినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం వయస్సు సడలింపు ఇవ్వడంతో దాదాపు 1.13 లక్షల మంది అభ్యర్థులకు లబ్ధి చేకూరిందని మొత్తం 4,29,000 మంది అభ్యర్థులు 5,77,064 దరఖాస్తులను సమర్పించారని వివరించారు. 68 శాతానికి పైగా అభ్యర్థులు కేవలం ఒక్క పోస్టుకే దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసిన వారిలో పురుషులు 74 శాతానికి పైగా ఉండగా, మహిళా అభ్యర్థులు 25 శాతానికి పైగా ఉన్నారని తెలిపారు.

97 శాత అథెంటికేషన్ పూర్తి

పోలీసు ఉద్యోగాలకు కేటగిరీల వారీగా పరిశీలిస్తే బీసీ అభ్యర్థులు దాదాపు 49 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 43 శాతానికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ను 97 శాతానికి పైగా అభ్యర్థులు విజయవంతంగా పూర్తి చేశారు. ఇంకా పూర్తి చేయని వారు ఈ నెల 30లోగా తమ లాగిన్ ద్వారా దీన్ని పూర్తి చేసి పీడీఎఫ్ ఫారామును డౌన్లోడ్ చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. మొత్తం 7,437 పోస్టులకు 5,77,064 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎస్సైటీ ఎస్ఐ సివిల్, తత్సమాన పోస్టులకు సంబంధించి 1,60,756 దరఖాస్తులు రాగా, ఎస్సైటీ కానిస్టేబుల్ సివిల్, తత్సమాన పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలను ఉమ్మడి పది జిల్లాలతో పాటు 15, 18 ప్రాంతాల్లో పరీక్ష నిర్వహించనున్నామని, ఎస్ఐ ఎఆర్ పీటీ, డ్రైవర్, మెకానిక్ పోస్టులకు తొలుత పిఎంటీ, పిఈటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. ఈ ఏడాది జులై 29న జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్ల ద్వారా వివిధ విభాగాల్లో మొత్తం 7,437 ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం కల్పించిన వయోపరిమితి సడలింపుతో సుమారు 1.13 లక్షల మంది అభ్యర్థులకు లబ్ధి చేకూరింది.

తెలుగును ఖరారు చేసిన ఎక్కువ మంది అభ్యర్థులు

పోలీసు పరీక్షలకు సంబంధించి మాధ్యమం విషయానికి వస్తే 56.84 శాతం మంది తెలుగును, 43.02 శాతం మంది ఇంగ్లీష్ ను, 0.12 శాతం మంది ఉర్దూను ఎంచుకున్నారు. నియామక ప్రక్రియలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ను 97.4 శాతం మంది అభ్యర్థులు మొబైల్ యాప్ ద్వారా విజయవంతంగా పూర్తి చేసుకున్నారని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల పూర్తి చేయని మిగిలిన 2.6 శాతం మంది అభ్యర్థులు సెప్టెంబర్ 30 వరకు తమ లాగిన్ ఏరియాలో ఈ ప్రక్రియను పూర్తి చేసి పీడీఎఫ్ అప్లికేషన్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?



బీజింగ్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన మొదలైంది. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ ప్రచారం జరుగుతున్నది. చైనా డెమోక్రటిక్ పార్టీ వైర్మన్ వాంజున్ షీ చేసిన పోస్టుతోనే ఈ ప్రచారం ఊపందుకుంది. 'బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను వెంటనే విమానంలో చైనాకు తీసుకొచ్చారు. స్వాగత ఏర్పాట్లు లేకుండా రహస్యంగా హెలికాప్టర్‌లో ఆర్మీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఇండియాలో అయితే అందరికీ తెలుస్తుందని.. అక్కడ ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితి ఏంటో తెలియదు' అని వాంజున్ పోస్టులో తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా జిన్‌పింగ్ తూలినట్లు కనిపించారు. దీంతో మోదీ ప్రసంగం ఆపి.. అంతా బాగానే ఉందా అని అడిగినట్లు సమాచారం. మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ హాజరు కాకుండానే చైనా వెళ్లిపోయారు. అప్పటి నుంచే అనుమానాలు పెరుగుతున్నాయి.

నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17

సుప్రీంకోర్టు ప్రతిపాదించిన బీమా లేకపోతే ఇంధనం లేదు విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ నంబర్లను ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(ఐఐబీ), 'వాహన్' రికార్డులతో సరిపోల్చే ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) సిద్ధమవుతున్నది.ప్రతిపాదిత విధానం అమల్లోకి వస్తే చెల్లుబాటు అయ్యే థర్డ్-పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ అమ్మడాన్ని ఇంధన కేంద్రాలు(పెట్రోల్ పంపులు) నిరాకరించే అవకాశం ఉంటుంది. ఈ ప్రయోగాత్మక కార్యక్రమం విజయవంతమైతే సాధారణ బీమా సంస్థలకు ఇది బీమా లేని భారీ సంఖ్యలో వాహనాలను అధికారిక బీమా పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తుంది.

బ్రిక్స్ సదస్సుపై పాక్-- ఐఎస్ఐ ఉగ్ర కుట్ర



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17

ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది.అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అమ్రు చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి. ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.

అభిషేక్ అదరహో

-30 బంతుల్లోనే శతకబాదిన శర్మ
-127 పరుగులతో భారత్ ఘన విజయం
-3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్
-భారత్ 221/7, అఫ్గనిస్తాన్ 94/10



న్యూఢిల్లీ

అభిషేక్ శర్మ (108, 34 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లు) విశ్వరూపం చూపించాడు. టీ20 క్రికెట్‌లో మూడో వేగవంతమైన సెంచరీ సాధించిన అభిషేక్ శర్మ ఫిరోజ్ షా కోట్లలో అఫ్గనిస్తాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. 11 సిక్స్‌లు, 9 ఫోర్లతో దండయాత్ర సాగించాడు. మరో ఓపెనర్ సంజు శాంసన్ (50, 35 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరిశాడు. తొలుత భారత్ 221/7 పరుగుల భారీ స్కోరు చేయగా, ఛేదనలో అఫ్గనిస్తాన్ 94 పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్ రెడ్డి (3/25), రవి బిష్ణోయ్ (3/26), అక్షర్ పటేల్ (2/9) మ్యాజిక్ చేయగా 14.1 ఓవర్లలోనే అఫ్గాన్ చేతులెత్తేసింది. అఫ్గాన్ బ్యాటర్లలో జద్రాన్ (25), అజ్మతుల్లా (17) చెప్పుకోదగిన స్కోరు చేశారు. మూడో టీ20లో 127 పరుగులతో భారీ విజయం సాధించిన భారత్ 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.

అభిషేక్ ఊచకోత

టాస్ నెగ్గిన అఫ్గనిస్తాన్ బౌలింగ్ ఎంచుకోగా.. అభిషేక్ శర్మ ఊచకోతకు పూనుకున్నాడు. పవర్‌ప్లేలోనే ఎడాపెడా బౌండరీలు బాదిన అభిషేక్ శర్మ అఫ్గాన్ బౌలర్లను ఒత్తిడిలో పడేశాడు. ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 16 బంతుల్లోనే అభిషేక్ అర్ధ సెంచరీ సాధించగా.. భారత్ తొలి ఆరు ఓవర్లలోనే 100 పరుగులు పిండుకుంది. మహ్మద్ నబి ఓవర్లో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ చెరో రెండు సిక్సర్లు కొట్టి విధ్వంసక ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు. అభిషేక్ శర్మ మరో ఐదు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 30 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇది మూడో వేగవంతమైన సెంచరీ కావటం విశేషం. ఓపెనర్లు తొలి వికెట్‌కు 9.5 ఓవర్లలో 142 పరుగులు జోడించారు. రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో సంజు శాంసన్ సైతం 34 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. ఓపెనర్లు ఇద్దరు నిష్క్రమించిన తర్వాత పరుగుల వేగం నెమ్మదించింది. తిలక్ వర్మ (2) రనౌట్ కాగా.. శ్రేయస్ అయ్యర్ (29) ధాటిగా ఆడలేకపోయాడు. శివమ్ దూబె (14), ఇషాన్ కిషన్ (10) ఎదురుదాడి చేయలేకపోయారు. ఓ దశలో 270-280 స్కోరు అంచనా వేసినా.. ఆఖరుకు 221 పరుగులకు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అఫ్గనిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (2/27) రెండు వికెట్లు పడగొట్టగా.. రషీద్ ఖాన్ (1/43), అబ్దుల్లా అహ్మద్‌జాయ్ (1/38) రాణించారు. తిలక్ వర్మతో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు రనౌట్‌గా వెనుదిరిగారు.

తెలంగాణ నేలది ధిక్కార స్వరం

-భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే కమ్యూనిస్టుల సాయుధ పోరాటం
-సెప్టెంబర్ 17 ప్రజాస్వామిక పాలనకు మార్గం వేసిన రోజు
-రైతులకు భరోసా ఉండాలి...మహిళలు ఆర్థికంగా ఎదగాలి
-ప్రతి పేదబిడ్డకూ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం
-ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరాలనే లక్ష్యంతో పాలన
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

-- హైదరాబాద్

తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అనీ, సమ్మక్క సారలమ్మ పోరాటం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఏది చూసినా అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ గడ్డ స్వభావ మని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పు టికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలి స్తూనే ఉందన్నారు. తెలంగాణ చరిత్ర ప్రజలే కేంద్రంగా పాలన ఉండాలని చెబుతున్నదనీ, అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ, ప్రపంచంతో పోటీపడేలా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. భారతదేశంలో నిజాం ప్రాంతం అంతర్భాగం కావాలన్న ఆకాంక్షతో ఆంధ్రమహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయని వివరించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటానికి రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు నాయకత్వం వహించారని తెలిపారు. ఆపరేషన్ పోలోతో నిజాం ప్రభువు భారత ప్రభుత్వానికి లొంగిపోయారనీ, 1947 సెప్టెంబర్ 17 నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామిక పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రాత్మక సందర్భమని చెప్పారు. అందుకే ప్రజా పాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడటం, ప్రభుత్వ వనరులు అందరికీ అందేలా చూడటం, ప్రతి మనిషీ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడమే ప్రజా పాలన అని స్పష్టం చేశారు.



ప్రజాప్రభుత్వం రైతు పక్షపాతి

ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అనీ, రూ.20,616 కోట్లు విడుదల చేసి రుణమాఫీ ద్వారా 23.35 లక్షల రైతుల కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయపడేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి రూ.1.72 లక్షల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. భూభారతి చట్టం ద్వారా సంస్కరణలు తీసుకొచ్చామనీ, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించామనీ, 5.94 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామనీ, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీ వంటి పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందనీ, ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికమని చెప్పారు.

ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి...ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగాలి

రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డా ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదిగి సగర్వంగా జీవించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల ఖర్చు ఆదా అయిందని వివరించారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం చేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజి, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని వివరించారు. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దెబస్సులు, సోలార్ ప్లాంట్ల ద్వారా మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెడుతున్నామని సగర్వంగా చెప్పారు.

ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలి

రాష్ట్రంలోని ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 15 లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామనీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామనీ, త్వరలో మరో 2.25 లక్షల మందికి ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్లకు తొలిదశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామనీ, హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల ద్వారా లక్ష ఇండ్లు కడుతామని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించామనీ, దాని ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతికి పంపామని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి దేశంలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేపట్టామని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన తెలంగాణ సోషల్ జస్టిస్ డేను నిర్వహిస్తున్నామన్నారు.

కేసీఆర్, రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధం

మొదటి తరువాయి

కేటీఆర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందనీ, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ వైపు ఏ తప్పైనా బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు.

కాంగ్రెస్ హామీలన్నీ బోగస్

కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యిరోజుల విఫల పాలన చూశాక తేలిపోయిందని కేటీఆర్ విమర్శించారు. వాటిపై నిలదీస్తామన్న భయంతోనే బీఆర్ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కై అసెంబ్లీని ఏకపక్షంగా నడిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదన్న రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజులపాటు పొడిగించి, మాపై సస్పెన్షన్లను ఎత్తేయండి. కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై ప్రజల పక్షాన కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ. నాలుగు వేల పింఛన్లు, రైతులకు కరెంట్, సాగునీరు, రైతుబంధు, అర్ధాంతరంగా రద్దు చేసిన రైతుబీమాపై సభాముఖంగా నిలదీస్తామని చెప్పారు.

ముఖ్యమంత్రి పదవికే రేవంత్‌రెడ్డి కళంకం

చట్టసభల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా, పెద్దరికంతో మాట్లాడాలే తప్ప అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రజలను, రాష్ట్రాన్ని, శాసనసభను తప్పుదోవ పట్టించడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను దుర్వినియోగం చేశారనీ, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసి అతను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెప్తే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు.

రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా హెచ్చరిక



న్యూఢిల్లీ,

రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలకు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని తెలిపింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. అయితే భారత్ తన ఇంధన భద్రతే ప్రాధాన్యమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తామని, దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్రం వెల్లడించింది.

ఇకపై మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 : ఇకపై మందుల దుకాణాల్లో సీసీటీవీ నిఘాను తప్పనిసరి చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదిస్తున్నది. నిర్దేశిత హెచ్, హెచ్1, ఎక్స్ క్యాటగిరీ ఔషధాల అమ్మకాలపై నిఘా కోసం ఈ చర్య చేపట్టనుంది. విస్తృతశ్రేణి ప్రిస్క్రిప్షన్ మందులు (వైద్యుల సూచనలతో వాడే మందులు)ను హెచ్ శ్రేణిగా, అదనపు పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ అవసరమయ్యే కొన్ని నిర్దిష్ట మందులను హెచ్1లోకి, అత్యంత కఠినమైన నియంత్రణలు కలిగిన మందులను ఎక్స్ శ్రేణిగా పరిగణిస్తారు.ఈ మూడు శ్రేణులకు చెందిన ఔషధాల అమ్మకాలు, పంపిణీని నియంత్రించడానికి, సరైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకాలు నిరోధించడానికి, రిటైల్ దుకాణ అమ్మకాల్లో పారదర్శకత, బాధ్యత పెంచడానికి, ఔషధ సరఫరా చైన్‌ను నియంత్రించడానికి ఈ చర్యలను ప్రతిపాదిస్తున్నారు. దీనిపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తెలంగాణకు భారీ వర్ష సూచన

మొదటి తరువాయి

వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికల ప్రకారం.. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం వరకు ఈదురుగాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు. వాతావరణ నిపుణుడు టి.బాలాజీ సైతం తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ 17, 18 తేదీల్లో రాత్రి, తెల్లవారుజామున తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేశారు. నగరంలో రాత్రిపూట మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నైరుతి రుతుపవనాల సీజన్లో రాష్ట్రంలో వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఇప్పటివరకు తెలంగాణలో సాధారణంగా 664.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 536.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఇది 19 శాతం లోటును సూచిస్తోంది. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 42 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. హైదరాబాద్‌లోనూ సాధారణ వర్షపాతం 550.8 మి.మీ. కాగా, ఇప్పటికి 432 మి.మీ. మాత్రమే కురిసింది. రానున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఎల్లాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడుకలు



పాపన్నపేట. సెప్టెంబర్17(మహాప్రభ)
గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించాలని ఐసిడిఎస్ సిడిపిఓ వెంకట రమణమ్మ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎల్లాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శశికళ, రమ, ఆయా అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడల్లో కుర్తివాడ క్లీన్ స్వీప్

- వాలీబాల్, ఖోఖోలో ఎనిమిది ప్రథమ స్థానాలు..
- కబడ్డీలో పాపన్నపేట కు 3 స్థానాలు
- జిల్లా, రాష్ట్ర స్థాయిలే లక్ష్యం



పాపన్నపేట, సెప్టెంబర్ 17, (మహా ప్రభ)
పాపన్నపేట ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో కుర్తివాడ విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్, ఖోఖో విభాగాల్లో పాల్గొన్న అన్ని కేటగిరీల్లో ప్రథమ స్థానాలు సాధించి క్లీన్ స్వీప్ చేశారు. వాలీబాల్‌లో అండర్-17 బాలురు, బాలికలు, అండర్-14 బాలురు, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖోలోనూ అండర్-17 బాలురు, బాలికలు, అండర్-14 బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. దీంతో రెండు విభాగాల్లో కలిపి కుర్తివాడ విద్యార్థులు ఎనిమిది ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పట్టుదలతో శిక్షణ అందిస్తున్నారు. ఆయన కృషికి తోడు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది అందిస్తున్న సహకారంతో విద్యార్థులు మండల స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారు. మండల స్థాయిలో విజయపరంపర కొనసాగించిన కుర్తివాడ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకాలు సాధించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా కబడ్డీ విభాగంలో పాపన్నపేట ఉన్నత పాఠశాలకు మూడు స్థానాలు దక్కాయి. చికోడ్ లింగాయి పల్లి కి ఒక స్థానం దక్కింది.

ఆపదలో ఉన్న కార్యకర్తకు అండగా నిలిచిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు.



మెదక్ జిల్లా 17సెప్టెంబర్ (మహాప్రభ).
ఏషియన్ పిసీఎల్ రైట్ సైడ్ లెగ్ సర్జరీ అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మెదక్ టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ చిన్నారుల భువన చెంద్రను మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పరామర్శించారు.
మెదక్ టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ భువన చెంద్రకు ఏషియన్ పిసీఎల్ రైట్ లెగ్ సర్జరీ జరిగిన విషయం తెలుసుకున్న యంగ్ డైనమిక్ లీడర్, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు "ధైర్యంగా ఉండండి... అండగా నేనున్నాను, నేను చూసుకుంటాను" అంటూ భువన చెంద్రకు ధైర్యం చెప్పారు. కార్యకర్త కష్ట సమయంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న డా. మైనంపల్లి రోహిత్ రావు ఆప్యాయతకు కార్యకర్తలు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ , మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్ , మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ , 27 వార్డు కౌన్సిలర్ అస్తర్‌గల్ల రాణి బాలరాజ్ , వార్డు ఇన్చార్జులు లక్ష్మణ్ శివరాములు రమేష్ గణేష్ పరమేష్ బలరాం శ్రీకాంత్ చాదల్ నవీన్ గారు,యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో అంబరాన్నంటిన విశ్వకర్మ జయంతి వేడుకలు

-భక్తిశ్రద్ధలతో భారీ శోభాయాత్ర..
-విశ్వకర్మ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ
-విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు..
-పాల్గొన్న పురప్రముఖులు, సంఘం నాయకులు



తూప్రాన్, సెప్టెంబర్ 17,(మహాప్రభ)
విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలు తూప్రాన్ పట్టణంలో గురువారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ శోభాయాత్ర పట్టణంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. విశ్వకర్మ భగవానుడికి జై అంటూ మార్మోగిన నినాదాలు, భక్తుల ఉత్సాహం, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.
భక్తి పారవశ్యంలో భారీ శోభాయాత్ర
విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉదయం తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు, అనంతరం మోర్ సూపర్ మార్కెట్ నుంచి లక్ష్మీ గార్డెన్స్ ముందున్న విశ్వకర్మ కార్యాలయం వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. విశ్వకర్మ సంఘం సభ్యులు, శిల్పులు, చేతివృత్తులవారు, పట్టణ ప్రముఖులు, భక్తులు ఈ శోభాయాత్రలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
భగవాన్ విశ్వకర్మను స్మరిస్తూ సాగిన శోభాయాత్ర పట్టణ ప్రజల దృష్టిని ఆకర్షించింది.
సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విశ్వకర్మ సమాజ ఐక్యతను, ఆధ్యాత్మిక భక్తిభావాన్ని చాటిచెప్పింది.
విశ్వకర్మ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ
శోభాయాత్ర అనంతరం లక్ష్మీ గార్డెన్స్ సమీపంలోని విశ్వకర్మ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి భగవానుడి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం నాయకులు, పురప్రముఖులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశ్వకర్మ భగవానుడి అనుగ్రహంతో సమాజం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.
సకల కళలకు ఆదిదేవుడు విశ్వకర్మ
ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, రాజు చారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి, విశ్వకర్మ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని తెలిపారు. హిందూ పురాణాల్లో విశ్వకర్మ భగవానుడిని దైవిక శిల్పిగా, సకల కళలకు ఆదిదేవుడిగా భావిస్తారని పేర్కొన్నారు.
శిల్పకళ, నిర్మాణ రంగం, యాంత్రిక నైపుణ్యం, సృజనాత్మకతకు ప్రతీకగా విశ్వకర్మ భగవానుడు నిలుస్తారని వివరించారు. పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారకానగరం, దేవలోక నిర్మాణాలు, పుష్పక విమానం, ఇంద్రుని వజ్రాయుధం వంటి అద్భుత సృష్టులు విశ్వకర్మకు ఆపాదించబడ్డాయని తెలిపారు.
విశ్వకర్మ జయంతి కేవలం ఒక ఆధ్యాత్మిక పండుగ మాత్రమే కాదని, శ్రమను, నైపుణ్యాన్ని, సృజనాత్మకతను గౌరవించే మహత్తరమైన సందర్భమని వారు పేర్కొన్నారు.
శ్రమజీవుల గౌరవానికి ప్రతీక విశ్వకర్మ జయంతి
మానవ ప్రగతికి, సాంకేతిక అభివృద్ధికి పునాది శ్రమేనని విశ్వకర్మ సంఘం నాయకులు తెలిపారు. కార్మికులు, శిల్పులు, చేతివృత్తులవారు, ఇంజనీర్లు, నిర్మాణ రంగ నిపుణులు తమ శ్రమతో సమాజ అభివృద్ధికి విశేషంగా దోహదపడుతున్నారని పేర్కొన్నారు.
విశ్వకర్మ పూజ సందర్భంగా పనిముట్లు, యంత్రాలు, వృత్తికి సంబంధించిన పరికరాలను శుభ్రపరిచి ప్రత్యేకంగా పూజించడం అనవాయితీగా వస్తోందన్నారు. పరిశ్రమల యజమానులు, కార్మికులు కలిసి విశ్వకర్మ భగవానుడిని ఆరాధిస్తూ తమ వృత్తుల అభివృద్ధి, సురక్షితమైన పని వాతావరణం, కుటుంబాల సంక్షేమం కోసం ప్రార్థిస్తారని వివరించారు.
ఆధునిక కాలంలో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, యాంత్రిక సాంకేతికత, నిర్మాణ రంగాల్లో పనిచేసే వారికి విశ్వకర్మ ఆరాధన స్ఫూర్తినిస్తుందని తెలిపారు. శ్రమకు గౌరవం ఇవ్వడం, వృత్తి నైపుణ్యాన్ని ప్రోత్సహించడం, కార్మికుల సేవలను గుర్తించడం ఈ పండుగ ప్రధాన సందేశమని పేర్కొన్నారు.
ఆధ్యాత్మికతతో పాటు సమాజ ఐక్యతకు నిదర్శనం
విశ్వకర్మ జయంతి వేడుకలు సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, వృత్తి గౌరవాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. తరతరాలుగా శిల్పకళలు, చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలను కాపాడుతూ వస్తున్న విశ్వకర్మ సమాజ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.
భగవాన్ విశ్వకర్మ ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ తమ వృత్తుల్లో అభివృద్ధి సాధించాలని, సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.
భక్తి, సంప్రదాయం, శ్రమ గౌరవం కలగలిసిన ఈ వేడుకలు తూప్రాన్ పట్టణంలో ఆధ్యాత్మిక సందడిని నింపాయి. విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలు భక్తి, శ్రమ గౌరవం, సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.
ప్రముఖుల సందడి.. సంఘం నాయకుల హాజరు
ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్ రామునిగారి నాగరాజు గౌడ్, మాజీ కౌన్సిలర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేష్, జిన్నా భగవాన్ రెడ్డి, తాటి లచ్చల్, తుమ్మల మల్లేష్, సామల అశోక్, కుమ్మరి రఘుపతి, తాటి లెక్చర్, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ సిఆర్ జానకిరామ్, సిఆర్ పూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.
అలాగే విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, రాజు చారి, సతీష్ చారి, శ్రీధర్ చారి, స్వామి చారి, మహేష్ చారి, యాదగిరి చారి, ప్రభాకర్ చారి, బ్రహ్మచారి, కృష్ణ చారి, నవీన్ చారి, అంజనేయులు చారి, నాగభూషణం చారి, వికాస్ చారి, శ్రీనివాస్ చారి, శ్రీధర్ చారి తదితరులు పాల్గొని విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సింగపూర్ బాటలో దేవరకద్ర విద్యా ప్రతిభ

అంతర్జాతీయ బోధనా విధానాలపై అధ్యయనానికి ఎంఈఓ పి. బలరాం ఎంపిక.. ఉమ్మడి పాలమూరు నుంచి నలుగురికి అరుదైన అవకాశం



దేవరకద్ర: సెప్టెంబర్ 17 మహాప్రభ
అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు.. ఆధునిక బోధనా పద్ధతులు.. విద్యార్థుల అభ్యసనంలో సరికొత్త విధానాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ విద్యాశాఖ చేపట్టిన ప్రతిష్టాత్మక సింగపూర్ స్టడీ టూర్‌కు దేవరకద్ర మండల విద్యాధికారి (ఎంఈఓ) పి. బలరాం ఎంపికయ్యారు. విద్యారంగంలో అంతర్జాతీయ అనుభవాన్ని సొంతం చేసుకునే అరుదైన అవకాశాన్ని ఆయన దక్కించుకున్నారు.
అంతర్జాతీయ అధ్యయన పర్యటన రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10 మంది విద్యాశాఖ అధికారులను ఎంపిక చేయగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మహబూబ్‌నగర్ డీఈఓ విజయకుమారి, దేవరకద్ర ఎంఈఓ పి. బలరాం ఎంపిక కావడం విశేషం.
ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు సింగపూర్‌లో స్టడీ టూర్ కొనసాగనుంది. ఇందులో భాగంగా పి. బలరాం సింగపూర్‌లోని విద్యా విధానాలు, ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన ప్రక్రియ, విద్యా నిర్వహణలో అమలు చేస్తున్న వినూత్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం ఆయన శనివారం సింగపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.
దేవరకద్ర నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకూ అవకాశం
అధికారులకే పరిమితం కాకుండా దేవరకద్ర మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు కూడా సింగపూర్ స్టడీ టూర్‌కు ఎంపిక కావడం మరో విశేషం. రాష్ట్రవ్యాప్తంగా 29 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా.. దేవరకద్ర మండలం నుంచి నార్లోనికుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు నోమేశ్వర్ రెడ్డి, దేవరకద్ర ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్) నఫీస్ ఉన్నీసా బేగం ఎంపికయ్యారు.
దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి డీఈఓ విజయకుమారి, ఎంఈఓ పి. బలరాం, ఉపాధ్యాయులు నోమేశ్వర్ రెడ్డి, నఫీస్ ఉన్నీసా బేగం ఈ నెల 19న సింగపూర్ స్టడీ టూర్‌కు వెళ్లనున్నారు.
స్థానిక అనుభవానికి.. అంతర్జాతీయ దిశ
సింగపూర్‌లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, బోధనా ప్రక్రియలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటిలో స్థానిక విద్యా అవసరాలకు అనుగుణమైన అంశాలను పరిశీలించే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించనుంది. దేవరకద్ర మండలం నుంచి ఎంఈఓతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు అంతర్జాతీయ అధ్యయన పర్యటనకు ఎంపిక కావడం స్థానిక విద్యారంగంలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

పన్నూర్‌లో ఘనంగా 'ప్రజాపాలన దినోత్సవం'

-సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబుల అండతో పల్లెల్లో పరుగులు పెడుతున్న అభివృద్ధి,సంక్షేమం
-మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ చిందం మహేష్!



రామగిరి, 7సెప్టెంబర్ (మహాప్రభ).
రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం' సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ మహేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో,రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని నియోజకవర్గంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. పేదలు,రైతులు,మహిళలు,యువత సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత,ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, వార్డు సభ్యులు స్వప్న,అరుణ,వైష్ణవి, ప్రభుత్వ పాఠశాల టీచర్ కవిత, అంగన్వాడీ,ఆశా వర్కర్లు,విద్యార్థులు, మరియు గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎక్సైజ్ సాయికిరణ్ రెడ్డి, ఎస్సై హరికృష్ణ ఘన సన్మానం





దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన ఎక్సైజ్ గా పదవి బాధ్యతలు వహించినటువంటి సాయి కిరణ్ రెడ్డి, ఎస్సై హరికృష్ణ శాలువాతో సత్కరించి, మెమెంటో అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి మీరు రావడం చాలా సంతోషదాయమని ఈ ప్రాంతానికి సేవలు చేయడం మేము అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మా సహాయ సహకారాలు డిపార్ట్మెంట్ కు, మీకు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, గడ్డం బిక్షమయ్య, పందుల సత్తయ్య గౌడ్, నిరంజన్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుకుడాల అనసూర్య మృతి బాధాకరం

-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
దేవరకొండ పట్టణానికి చెందిన వనం జగదీశ్వర్ అత్త కుకుడాల అనసూర్య మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం కుకుడాల అనసూర్య దశాదిన కర్మ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనసూర్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, మాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఇస్లావత్ అభిషేక్,పగిడిమర్రి సతీష్, వల్లసాని వెంకన్న,తదితరులు ఉన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవానికి ఘన నివాళి

-దేవరకద్ర మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ.. ఘనంగా వేడుకలు





దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 17 మహాప్రభ
దేవరకద్ర: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరకద్ర మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి జెండాను ఆవిష్కరించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా చారిత్రక పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం మున్సిపల్ చైర్మన్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో దేశభక్తి భావం వెల్లివిరిసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించి తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను చాటిచెప్పారు. కార్యక్రమం ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

ఘనంగా మైనంపల్లిలో స్వచ్ఛ తహి కార్యక్రమం



దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
మైనంపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో పాల్గొని స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ప్రజలకు అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ. పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్. వార్డు సభ్యులు కొర్ర కిషన్ నాయక్ .పులిజలా నాగరాజు. అంగన్వాడీ టీచర్లు కమలమ్మ.బుజ్జి. లచ్చి. కలమ్మ. వైద్య సిబ్బంది స్వాతి. విద్యవతి. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహణ

-ఖిల్లా పార్క్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ



దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
దేవరకొండ: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం దేవరకొండ పట్టణంలోని ఖిల్లా బజార్ ఖిల్లా పార్క్‌లో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. బీజేపీ దేవరకొండ పట్టణ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు శివ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరయోధులను స్మరించుకున్నారు.
త్యాగాల చరిత్రను భావితరాలకు తెలియజేయాలి -- కేతావత్ లాలు నాయక్
ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.
తెలంగాణ విమోచన కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో దేశ సమగ్రత, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను యువతలో మరింతగా పెంపొందించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, బిజెపి నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, మాజీ ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇడం రవికుమార్, నేతాల వెంకటేష్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలక రాజు బిక్కు పున్న వెంకటేశ్వర్లు జల్దగీతారాణి పున్న భాగ్యలక్ష్మి మునగపాటి చంద్రకళ శివ కారు ప్రమోద్ సంపంగి సైదులు గణేష్ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు





-పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్

దేవరకొండ సెప్టెంబర్ 17 (మహా ప్రభ)
భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా బీజేపీ దేవరకొండ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ దేవరకొండ పట్టణ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్, బిస్కెట్లు, అలాగే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన మహిళలకు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ప్రజాసేవకు, పేదలు మరియు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మోదీ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. వృద్ధుల పట్ల ఆప్యాయత చూపడం, ప్రసవించిన మహిళలకు అవసరమైన సమయంలో చిన్న సహాయం అందించడం వంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన విధంగా సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, బీజేపీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలకరాజు బిక్కు, కోశాధికారి నీల సుమన్ ,గంజి హరి, నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బిక్షపతి, పున్న వెంకటేష్ నేత, జల్దా గీతా రాణి, మునగపాటి చంద్రకళ, సంపంగి సైదులు, శివ, బన్నీ యాదవ్, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకుంటలో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన.

- అధికారులకు ఆర్టీవో రమాదేవి సూచనలు

రామాయంపేట, సెప్టెంబర్ 17 మహాప్రభ
రామాయంపేట పట్టణ సమీపంలోని ఎన్‌హెచ్-44 రహదారి పక్కన ఉన్న సర్వేకుంట వద్ద వినాయక నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను మెదక్ ఆర్టీఓ రమాదేవి పరిశీలించారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన సుమారు 75 భారీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి సర్వేకుంటను సిద్ధం చేస్తున్న నేపథ్యంలో అధికారులు చేపడుతున్న చర్యలను ఆమె సమీక్షించారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తో కలిసి ఆర్టీఓ రమాదేవి చెరువు పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ రజనీకుమారి, మున్సిపల్ కమిషనర్, పట్టణ ఎస్ఐ బాలరాజుతో కలిసి నిమజ్జన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిమజ్జన సమయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ రమాదేవి మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భారీ సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు క్రేన్లు, బారికేడ్లు తదితర సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. చెరువు పరిసరాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని ఆమె సూచించారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం.





మెదక్ జిల్లా -17సెప్టెంబర్ (మహాప్రభ).
సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని మెదక్ పట్టణంలో రాందాస్ చౌరస్తా మరియు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను రోహిత్ రావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ తరతరాల అణిచివేత దోపిడీ భాగ్య స్వామి పెత్తందారి విధానాలపై దిక్కారస్వరం వినిపించిన నేల తెలంగాణ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ,, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నెల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజనేయులు గౌడ్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల. గంగాధర్ , మున్సిపల్ చైర్మన్ కానుగురాధికా భూపతి రాజు , వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ లు తూర్పునూరు చంద్రపాల్ ,, గూడూరు కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ , మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి మనుషులు , లలిత విశ్వం , ఆవారి రాజశేఖర్ , టి శివరామకృష్ణ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు మ్యాడం బాలకృష్ణ,దేవుల నాయక్,సయ్యద్ కుమార్,చెదల నవీన్, సిద్ధ రాములు, బాలరాజు,యాదవ్,సమియోద్దీన్,ఎండి సోఫీ, గాడి రమేష్,పూసల సంతు,ఎండి హామీర్, మహేశ్వరి,సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు..

జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో రమావత్ రవీంద్ర కుమార్

-నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు



దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17కు భారతదేశ, తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం చారిత్రక పరిణామమని పేర్కొన్నారు. ఈ పరిణామం తెలంగాణ ప్రజల చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు.ప్రజల పోరాటాల ఫలితంగానే ప్రజాస్వామ్య పాలన,నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య పాలన వైపు తెలంగాణ సమాజం ప్రయాణం సాగిందని రవీంద్ర కుమార్ అన్నారు. ఈ చారిత్రక పరిణామంలో ప్రజల పోరాటాలు, త్యాగాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని రవీంద్ర కుమార్ తెలిపారు.ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం గిరిజనుల సామాజిక, విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక సామాజిక-ఆర్థిక నివేదికలోనూ 2022 సెప్టెంబర్ 30న ఎస్టీ రిజర్వేషన్ 6% నుంచి 10%కు పెంచినట్లు పేర్కొంది.3,146 తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని రవీంద్ర కుమార్ అన్నారు.తండాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు స్థానికంగా పరిపాలనా అవకాశాలు పెరగడానికి ఈ నిర్ణయం దోహదపడిందని పేర్కొన్నారు.మిషన్ భగీరథతో పాటు విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో తండాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని రవీంద్ర కుమార్ తెలిపారు.గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు గిరిజన సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల గొంతుకకు, ప్రజల ప్రశ్నించే హక్కుకు రక్షణ ఉండాలని రవీంద్ర కుమార్ అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు.ప్రస్తుత పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ప్రజల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని రవీంద్ర కుమార్ అన్నారు.

రాంరెడ్డిపల్లిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
చింతపల్లి మండలం పరిధిలో.రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ లో. తెలంగాణవిమోచనదినోత్సవాన్ని పురస్కరించుకుని రాంరెడ్డిపల్లి.గ్రామపంచాయతీ.కార్యాలయంవద్ద.గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.గ్రామసర్పంచ్.లపంగినరసింహఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిజాతీయజెండాకుగౌరవవందనంసమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచపొగాకుసైదులు, గ్రామ కార్యదర్శి నజీరా, పీర్ల.అసిస్టెంట్సలీవోజుయాదయ్య,గ్రామశాఖఅధ్యక్షులు కారింగు నరసింహ, వార్డు సభ్యులు,లపంగిమహేందరపగిళ్ల,శంకర్,కొత్తలింగ స్వామి.నిరంజన్,భీమగోనియాదయ్య,సిరిపంగిశ్రీను, బండి హనుమంతు,ఆశా వర్కర్లు,గ్రామప్రజలుపాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

-బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్

దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
తెలంగాణలో గిరిజనుల అభ్యున్నతికి, సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేశారని బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు దేవరకొండ మండలం బాధ్యానాయక్ తండాలో నేనావత్ లక్పతి నాయక్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి గ్రామస్తులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు.
ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోని సంక్షేమ పథకాలను, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు:
తండల అభివృద్ధి 500 జనాభా ఉన్న ప్రతి తండాను సర్పంచ్ అధికారాలతో గ్రామపంచాయతీగా మార్చి, స్వయంపాలన అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.



కళ్యాణలక్ష్మి: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు 1,00,116 అందించడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఆడపిల్లల అమ్మకాలకు అడ్డుకట్ట వేశారు.
కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఎన్నికల సమయంలో చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో 420 హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను పూర్తిగా మోసం చేసింది.
కార్పొరేషన్ల నిర్వీర్యం: అధికారంలోకి వచ్చాక సంత్ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టి నిర్వీర్యం చేసింది.
గిరిజనుల సంక్షేమం కేసీఆర్ తోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గిరిజనులు తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.
హాజరైన ముఖ్య నాయకులు:
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డి, ఎపి.ఎ.సి. ఎస్.చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుభాష్ గౌడ్, నేనావత్ కళ్యాణ్ నాయక్, నేనావత్ నాగార్జున నాయక్, నేనావత్ రమేష్ నాయక్, గ్రామ యువకులు, నాయకులు మరియు గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న,జాలేనరసింహారెడ్డి.

దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
గురువారం.చందంపేట మండలంలోని పోలేపల్లి క్రాస్ రోడ్డు లోని చిత్రియాల ప్రాథమిక సహకార సంఘం సొసైటీ.అధికారులుమరియు సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్రప్రజలకు ప్రజాపాలనదినోత్సవశుకాంక్షలుతెలిపిన. పిఏసిఎస్ చైర్మన్.నరసింహారెడ్డి.ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ.సెప్టెంబర్ 17 1948న నిజాం పాలన నుండి తెలంగాణ రాష్ట్రం విముక్తి పొందింది అన్నారు. అందువలన ఈ చారిత్రక దినాన్ని ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా జరుపుతుంది అని ఆయన తెలిపారు.. అదే విధంగా ప్రజల కోరిక మేరకు ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందిఅని.అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అంకులయ్య, ఇప్ప తిరుపతి రెడ్డి, హరీశ్ చారి, ఆంజనేయులు, వంశీ (అయ్యగారు) కార్తీక్ రెడ్డి, గణేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ప్రత్యేక పూజలు



దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని 5వ వార్డులో అత్యంత వైభవంగా నెలకొల్పిన వినాయకుడిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ దర్శించుకున్నారు. ఈశ్వర పుత్ర గణేష్ ఉత్సవ కమిటీ దేవరకొండ నియోజకవర్గంలోనే అతిపెద్దదిగా పేరొందిన ఈ గణపతి మండపంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా లంబోదరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, దేవరకొండ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.
హాజరైన ముఖ్య నాయకులు ఉ ప్రజాప్రతినిధులు:
ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు:

దేవరకొండ ఎం కె ఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

దేవరకొండ సెప్టెంబర్ 17 (మహాప్రభ)
మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జాతీయ త్రివర్ణ పతాకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది అన్నారు. తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులు, స్వేచ్ఛ కోసం సాగిన పోరాటాలు, ఎందరో ప్రజలు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలు, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కేంద్రబిందువులని, ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన అన్నారు. చరిత్రను కేవలం పాఠ్యాంశంగా కాకుండా, సమాజ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకునే సాధనంగా విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజా ఉద్యమాల గురించి యువత తెలుసుకోవడం ద్వారా తమ ప్రాంతం పట్ల అవగాహనతో పాటు సామాజిక బాధ్యత కూడా పెంపొందుతుందని తెలిపారు. నేటి విద్యార్థులు భవిష్యత్ సమాజానికి మార్గదర్శకులని, దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రిన్సిపాల్ అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, మానవతా విలువలను అలవరచుకుని సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛా ఫలాలను అనుభవిస్తున్న ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సి ఓ ఈ జి. లింగారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. కె.పృథు, ఎన్సిసి సీటీవో ఆర్.నాగేంద్ర, డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ వి. మకట్లాల్, డాక్టర్ కె .రేణుక, తదితర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



గాంధారి, సెప్టెంబర్ 17: (మహాప్రభ)
ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గాంధారి మండలం మాతుసంగెం గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.
నరేంద్ర మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని గణేష్ ని మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

కార్మికుల సౌకర్యార్థం వెహికల్ షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ఐఎఫ్‌టీయూ నాయకులు ఏ. వెంకన్న వినతి

రామగిరి,సెప్టెంబర్ 17 (మహాప్రభ)
అర్జీ-3 జీఎం కార్యాలయం వద్ద వెహికల్ స్టాండ్ నిర్మించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ నాయకులు ఏ.వెంకన్న గురువారం జీఎం సుంకర మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు.జీఎం కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం కార్మికులు,కాంట్రాక్టర్లు, కార్మిక నాయకులు,ప్రభావిత గ్రామాల ప్రజలు,రాజకీయ నాయకులు తదితరులు నిత్యం వస్తుంటారని ఏ.వెంకన్న తెలిపారు. కార్యాలయానికి వచ్చే వారు తమ వాహనాలను ఒకే చోట నిలుపుకునేందుకు సరైన సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జీఎం కార్యాలయం వద్ద ఒక ప్రక్కన రేకులతో షెడ్డు నిర్మించి,దానిని వెహికల్ స్టాండ్‌గా ఏర్పాటు చేయాలని కోరారు.ఈ షెడ్డు వర్షాకాలం,ఎండాకాలంతో పాటు అన్ని కాలాల్లో వాహనాల పార్కింగ్‌కు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి కార్మికులు,ప్రజల సౌకర్యార్థం వెహికల్ షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఏ.వెంకన్న జీఎం సుంకర మధుసూదన్‌ను కోరారు.



టాయిలెట్లు లేక ప్రయాణికులు, వ్యాపారుల అవస్థలు

దేవరకద్ర కొత్త, పాత బస్టాండ్లలో కనీస సౌకర్యాల కొరత.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

దేవరకద్ర. సెప్టెంబర్ 17 మహాప్రభ

ప్రయాణికుల సౌకర్యార్థం ఉండాల్సిన బస్టాండ్లలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్లలలో మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో నిత్యం బస్సుల కోసం వచ్చే ప్రయాణికులతో పాటు సమీపంలోని స్థానిక వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్లలో రోజూ వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం కొంతసేపు వేచి ఉండే సమయంలో అత్యవసరంగా టాయిలెట్ అవసరం ఏర్పడితే సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నట్లు ప్రయాణికులు పేర్కొంటున్నారు. మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం వల్ల ప్రయాణికుల పరిస్థితితో పాటు బస్టాండ్ల పరిసరాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న స్థానిక వ్యాపారస్తులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ వ్యాపార కార్యకలాపాల నిమిత్తం రోజంతా అక్కడే ఉండే వ్యాపారస్తులకు కూడా టాయిలెట్ సౌకర్యం అవసరంగా మారింది. ప్రయాణికులు, వ్యాపారులు ఈ సమస్యపై పలుమార్లు దృష్టి సారించినప్పటికీ శాశ్వత పరిష్కారం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక సదుపాయాల్లో మరుగుదొడ్లు కీలకమైనవని, బస్టాండ్లలో వాటిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులు, వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని కొత్త, పాత బస్టాండ్లలో మరుగుదొడ్లను ఏర్పాటు చేసి, వాటి పరిశుభ్రత, నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేవరకద్ర బస్టాండ్లలో నెలకొన్న టాయిలెట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రయాణికులు, స్థానిక వ్యాపారస్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రోడ్డు నిర్మాణం పనులు పర్యవేక్షణ



మంథని,సెప్టెంబర్ 17,(మహా ప్రభ)

మంథని పట్టణ అభివృద్ధి మంత్రి శ్రీధర్ బాబు ధ్యేయమని మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి అన్నారు. గురువారం మంథని పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ మనోహర్ తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న పనుల్లో నష్టపోతున్న వారిని సంప్రదించి పనులు ముందుకు తీసుకెళ్లాలని తమకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారని వారు తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా పక్షపాత వైఖరి అవలంబించవద్దని మంత్రి సూచించినట్లు వారు పేర్కొన్నారు. నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. మూల మలుపుల వద్ద అలాగే నాలుగు రోడ్లు కలిసే ప్రాంతం విస్తారంగా ఉండాలని ప్రణాళికలను రూపొందించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పెంటరి రాజు తో పాటు గ్రామస్తులు మహావాది విజయ్ కుమార్, రంగి అమర్నాథ్, జక్కం రంజిత్ తదితరులు పాల్గొన్నారు..

అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే

- చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్



తూప్రాన్, సెప్టెంబర్ 17,(మహా ప్రభ)

అందమైన చేతిరాత అందరికీ సాధ్యమేనని చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ అన్నారు. గురువారం తూప్రాన్ పట్టణంలోని చిల్డ్రన్స్ హైస్కూల్లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ మాట్లాడుతూ వారం రోజులలో అందమైన చేతిరాత అందరికీ సాధ్యమవుతుందని, చేతిరాత బాగుంటే, విద్యార్థుల భవిష్యత్తుకు సోపానంగా మారుతుందని అదే భవిష్యత్తుకు సోపానంగా మారుతుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు చేతిరాతను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీంతో భవిష్యత్తులో ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయ వరప్రసాద్, సుజాత మోజేస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ జన్మదినం.. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తూప్రాన్‌లో సేవా కార్యక్రమాలు





-జాతీయ జెండా ఆవిష్కరణ..

-ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

-ప్రతి ఇంటా దీపం వెలిగించి మోదీ జన్మదిన వేడుకలు

తూప్రాన్, సెప్టెంబర్ 17,(మహాప్రభ)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం, సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం తూప్రాన్ మున్సిపల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ మాట్లాడుతూ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రధానమంత్రిగా దేశానికి సేవలందిస్తున్న నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారని తెలిపారు. దేశ అభివృద్ధితో పాటు పేదలు, మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జనధన్ యోజన ద్వారా సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడం, ఉజ్వల యోజన ద్వారా పేద కుటుంబాల మహిళలకు ఎల్పీజీ కనెక్షన్లు అందించడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించడం, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత కల్పించడం, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు.

తెలంగాణ విమోచన దినోత్సవం చారిత్రక ప్రాధాన్యతను చాటాలి

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజు జానకిరామ్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు సాగించిన పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి యువత తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను చాటుకున్నామని తెలిపారు. దేశానికి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి ఇంటా దీపం వెలిగించాలి

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 7 గంటలకు ప్రతి ఇంటిలో దీపం వెలిగించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్య క్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొల్లం సత్యనారాయణ, చండీ అశోక్, మన్న స్వామి, సీనియర్ నాయకులు వేణుగోపాల్, రమేష్ గౌడ్, సిద్ధిరాములు, మున్సిపల్ జనరల్ సెక్రటరీ పోతరాజు శరత్, సంపత్ గౌడ్, యువమోర్చా మున్సిపల్ అధ్యక్షుడు వంగలి నవీన్ యాదవ్, బీజేపీ నాయకులు దుర్గేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

కొర్రనిర్యామృతిబాధాకరం-బి ఆర్ ఎస్.దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 17 (మహాప్రభ)

డిండి మండలం కటిక బండ తండాకి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త కొర్ర నిర్యా గురువారం. మృతి చెందారు వారి కుటుంబ సభ్యులకు పరామర్శించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్. ఆయన వెంట సర్పంచ్ బాధ్య నాయక్, అరుణ్, విజయతదితరులుఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి పూజ

న్యూ బాలాజీ నగర్‌లో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు.. అన్నప్రసాద వితరణ



దేవరకద్ర డివిజన్ సెప్టెంబర్ 17 (మహాప్రభ)



దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని న్యూ బాలాజీ నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి గురువారం మహాగణపతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుని సన్నిధిలో కొండ నాగిరెడ్డి వరలక్ష్మి దంపతులు సాయినాథ్ రెడ్డి కుమారుడు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల గణపతి నామస్మరణతో పూజా ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తుల ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం భక్తిమయంగా జరిగింది. కాలనీవాసుల సహకారంతో పూజా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

తూప్రాన్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

-శ్రీ సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ

-జాతీయ జెండాను ఆవిష్కరించిన లయన్ డాక్టర్ సిఆర్ జానకిరామ్

-స్టార్ వాల్స్ గణపతి వద్ద జెండా ఎగురవేసిన తాటి చంద్రవదన్, బి. వినాయక్ రెడ్డి



తూప్రాన్, సెప్టెంబర్ 17,(మహా ప్రభ)

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ పట్టణంలో జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది. శ్రీ సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన లయన్ డాక్టర్ జానకిరామ్

శ్రీ సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్ డాక్టర్ సిఆర్ జానకిరామ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం పట్టణంలోని థియేటర్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్టార్ వాల్స్ గణపతి వద్ద తాటి చంద్రవదన్, బి. వినాయక్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, వందే మాతరం గీతాలాపన గావించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ..తెలంగాణ విమోచన దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకునే చారిత్రక సందర్భమని ఆయన అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వారి త్యాగాలు, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

తూప్రాన్ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా ఆర్. అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన పోరాటంలో తూప్రాన్ ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలనే లక్ష్యంతో తూప్రాన్‌కు చెందిన చిదు గోపాల్ రెడ్డి, రామునిగారి సత్యనారాయణ గౌడ్, రామునిగారి రామస్వామి గౌడ్, నేతి బాల్ రాజు గుప్త పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటంలో భాగంగా వారు 14 నెలల పాటు నిజామాబాద్ జైలులో శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. సమరయోధులకు తామ్రపత్రాలతో సత్కారం

స్వాతంత్ర్య సమరయోధులను అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో సంగారెడ్డిలో తామ్రపత్రాలు అందజేసి సన్మానించినట్లు అశోక్ కుమార్ గౌడ్ వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పింఛన్ పథకం ద్వారా వారికి ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులకు పది ఎకరాల చొప్పున భూమి మంజూరు చేసినట్లు కూడా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్రీహరి, ఏపూరి రాజు భయ్యా, కే. అభిషేక్ గౌడ్, తాటి వెంకటేష్, స్వర్గం వెంకటనారాయణ, కంఠాయపాలెం వేణుగోపాల్, భూమన్నగారి జానకిరామ్, స్టూడియో బాలు, వివేక్, శ్రీశైలం, మధు, తాటి చంద్రవదన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతకు చిరునామా... తిరుపతయ్య గారు



దేవరకద్ర సెప్టెంబర్ 17 మహాప్రభ

సమాచారమే ఆయుధంగా...
అప్రమత్తతే ఆభరణంగా...
గోప్యతను గుండెల్లో దాచుకుని,
ప్రజా భద్రతే పరమ ధ్యేయంగా...
ఇంటెలిజెన్స్ ఏఎస్ఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన
శ్రీ తిరుపతయ్య గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు!
విధి పిలిస్తే ముందుండే ధైర్యం,
బాధ్యత అప్పగిస్తే నిలబెట్టే నిబద్ధత,
ప్రతి సమాచారాన్ని పరిశీలించే నేర్పు,
ప్రతి అడుగులో శాఖ గౌరవాన్ని కాపాడే క్రమశిక్షణ...
యూనిఫామ్‌లో సేవాభావం...
విధుల్లో వజ్ర సంకల్పం...
అప్రమత్తతలో అగ్రగామి...
తిరుపతయ్య గారి కొత్త బాధ్యతలకు
విజయాలే విజయాలు కావాలి!
జై హింద్



అల్లు అర్జున్ 'రాకా' నుంచి క్రేజీ అప్‌డేట్..

ట్రెండింగ్‌లో '37'!



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా' సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించి తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ ఎక్స్ వేదికగా 37 అనే నెంబర్‌ని పోస్ట్ చేసింది. అయితే ఈ సంఖ్య వెనుక ఓ కొత్త అప్‌డేట్ రాబోతుందని తెలుస్తుంది. దీంతో నెట్టింట 37 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. అసలు ఈ ట్రెండింగ్‌లో కనిపిస్తున్న '37' అనే సంఖ్య దేనికి సంబంధించినది? చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి సరికొత్త ప్రకటన రాబోతుంది? అంటూ అల్లు అభిమానులు తీవ్ర ఉత్కంఠతో చర్చించుకుంటున్నారు.స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ తరుణంలో మేకర్స్ ప్లాన్ చేసిన ఈ సరికొత్త సర్‌ప్రైజ్ అప్‌డేట్ ఏమై ఉంటుందోనని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక క్లారిటీ రానుంది.

చిరు 'కాకా'లో స్నేహ..

మెగాస్టార్‌కి జోడీగా?



మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబి కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా పై టాలీవుడ్‌లో రోజురోజుకూ అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఓ క్రేజీ రూమర్ ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. అప్పట్లో అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ప్రముఖ సీనియర్ నటి స్నేహ.. ఇప్పుడు మెగాస్టార్ సరసన నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తోంది.ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, 'కాకా' చిత్రంలో స్నేహ చిరంజీవి భార్య పాత్రలో కనిపించనున్నారట. ఈ వార్త నిజమైతే కచ్చితంగా ఇది అభిమానులకు పండగలాంటి వార్తే అవుతుంది. కొన్నేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో స్నేహ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో మెగాస్టార్ చిరంజీవితో ఒక్కసారైనా స్క్రీన్ షేర్ చేసుకోవాలని, అది తన చిరకాల కోరిక అని మనసులోని మాటను బయటపెట్టారు. ఆనాడు ఆమె పంచుకున్న కల ఇప్పుడు నెరవేరబోతుండటం విశేషం. వివాహం తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా సెలెక్టివ్‌గా మంచి ప్రాజెక్ట్స్ మాత్రమే ఎంచుకుంటున్న స్నేహకు.. ఈ సినిమా ద్వారా తెలుగు తెరపై మరోసారి భారీ రీఎంట్రీ లభించినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండబోతోంది. ఆక్వా పరిశ్రమలో ఒక సాధారణ సూపర్‌వైజర్‌గా 'కె. సత్యం' అనే విలక్షణ పాత్రలో మెగాస్టార్ కనిపించనున్నారు. పైకి చాలా కూల్‌గా, సాధారణంగా కనిపించే ఈ పాత్ర వెనుక ఒక బలమైన ఎమోషనల్ బ్యాక్‌డ్రాప్ ఉన్నట్లు గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది. మరోవైపు, మలయాళ యువ నటి అనస్వరా రాజన్ ఈ చిత్రంలో అత్యంత కీలకమైన 'అమ్ములు పాప' అనే పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా కథా గమనాన్ని మలుపు తిప్పే ఈ పాత్ర చిత్రానికే గుండెకాయ లాంటిదని ఇప్పటికే మేకర్స్ ప్రకటించడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ భారీ మాస్ ఎంటర్‌టైనర్‌ను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే నటి స్నేహ ఎంట్రీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

రణబాలి' షూటింగ్ పూర్తి..

అక్టోబర్ 16న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్ పాన్-ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' షూటింగ్ తాజాగా పూర్తిచేసుకుంది. రౌడీ హీరో విజయ్ దేవరకొండ, స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ భారీ చారిత్రాత్మక చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.ఇక సినిమా థియేట్రికల్ విడుదలకు సరిగ్గా 29 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, మేకర్స్ ప్రమోషన్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేశారు. రణబాలి మరియు జయమ్మ మిమ్మల్ని థియేటర్లలో కలవడానికి సరిగ్గా 29 రోజుల్లో సిద్ధమవుతున్నారు అంటూ చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేకమైన పోస్టును షేర్ చేసింది. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన విజువల్ వండర్, అసాధారణ సినిమా అనుభూతిని పంచేందుకు కౌంట్‌డౌన్ అధికారికంగా మొదలైందని, రాబోయే అక్టోబర్ 16న దసరా పండుగ కానుకగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అత్యంత వైభవంగా ప్రేక్షకుల ముందుకు రానుందని యూనిట్ వెల్లడించింది. మరోవైపు, ఇటీవల విడుదలైన 'రణబాలి' టీజర్ యూట్యూబ్‌లో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలవడమే కాకుండా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది.

800లకు పైగా ప్రీమియర్ షోలు..

నాని 'ది ప్యారడైజ్' మూవీకి సరికొత్త రికార్డులు!



టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటిసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, సినిమా విడుదలకు ముందే సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. సెప్టెంబర్ 23న తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏకంగా 800లకు పైగా భారీ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటివరకు విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇందులో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త రగ్గడ్ మరియు మాస్ లుక్‌లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి థియేటర్లలో 'జడల జమాన' అధికారికంగా ప్రారంభం కానుండటంతో నాని అభిమానులు, మాస్ ఆడియెన్స్ ఈ సినిమా కోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

హృదయాన్ని కదిలించిన పాట

అగ్ర కథానాయిక తమన్నా నటిస్తున్న తాజా చిత్రం 'ది వివాన్' త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో ఆమె సిద్ధార్థ మల్హోత్రా సరసన నటిస్తున్నది. ఇటీవలే ట్రైలర్‌ను విడుదల చేశారు. అడవి నేపథ్యంలో మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఛఠ్ పూజ నేపథ్యంలో చిత్రీకరించిన పాట తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమని చెప్పింది తమన్నా. ఆమె మాట్లాడుతూ 'నేను ముంబయిలో పుట్టిపెరిగాను. అక్కడ జుహూ బీచ్‌లో కొన్ని వేలమంది మహిళలు ఛఠ్ పూజ చేయడం చూసేదాన్ని.అయితే ఆ సంప్రదాయం గురించి నాకు ఎలాంటి వివరాలు తెలియవు. సినిమాలో పాట చిత్రీకరిస్తున్నప్పుడు ఆ పూజ చేయడం ఎంత కష్టమో అర్థమైంది. దాదాపు 36 గంటల పాటు నీళ్లు కూడా ముట్టుకోకుండా భక్తిశ్రద్ధలతో మహిళలు ఆ పూజలో నిమగ్నమవుతారు. బీహారీ సంస్కృతిలో ఈ పూజ అందమైన భాగం. మనం ఉదయించే సూర్యుడికి నమస్కరించి పూజాదికాలు చేస్తాం. కానీ వారు అస్తమించే సూర్యుడికి కూడా అంతే ప్రాముఖ్యతనిస్తారు. ఈ పాట షూటింగ్ టైమ్‌లో భావోద్వేగాల్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలున్నాయి. ఏదో అతీతశక్తి నాలో ప్రవేశించి ఉద్వేగాన్ని కలిగించినట్లుగా అనిపించింది. నా హృదయాన్ని కదిలించిన పాట ఇది' అని తమన్నా చెప్పింది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com